క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నడిగూడెం : మండలంలోని సిరిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల శ్రీరంగాపురంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున గ్రామానికి శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అదనపు జూనియర్ సివిల్ జడ్జి నియామకం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇటీవల ప్రారంభించిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు న్యాయమూర్తిని నియమిస్తూ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్తుపల్లిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న షేక్ ఆయేషా పర్వీన్‌ను హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. మే 1వ తేదీ లోపు పదవీ బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెంలో గల రైతు వేదికలో శనివారం భూ భారతి చట్టంపై కలెక్టర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కమలాకర్ తెలిపారు. సదస్సుకు ప్రజాప్రతినిధులు, రైతులు హాజరు కావాలని కోరారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణకు మంద కృష్ణమాదిగ రాక

మోతె : మండలంలో తుమ్మగూడెం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణకు శనివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ రానున్నట్లు విగ్రహాల నిర్వహణ కమిటీ సభ్యులు గట్టిగుండ్ల దుర్గారావు, చిలక రమేష్, ఉబ్బపెల్లి బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, వికలాంగుల సంఘం నాయకులు తరలిరావాలని కోరారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి



పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, తదితరులు

మఠంపల్లి : మండల కేంద్రంలో శుభవార్త చర్చి వార్షికోత్సవాలను పురస్కరించుకుని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు, ఎస్‌ఐ పి.బాబులు శుక్రవారం చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫాదర్ మార్టిన్ పసల, స్థానికులు పాల్గొన్నారు.

'మట్టపల్లి రజక సత్రంకు నారాయణకు సంబంధం లేదు'

హుజూర్‌నగర్ : మట్టపల్లిలోని రజక సత్రం కమిటీకి కాచవారిగూడెంకు చెందిన దాసరాజు నారాయణకు ఎటువంటి సంబంధం లేదని సత్రం కమిటీ అధ్యక్షుడు పిల్లుట్ల కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన రజక సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల రజక కులస్తుల సమక్షంలో మట్టపల్లి రజక సత్రం కమిటీని ఎన్నుకొని ఆ కమిటీ ద్వారా సత్రం అభివృద్ధి, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దాసరాజు నారాయణ రజక సత్రం పేరుతో నకిలీ రశీదు పుస్తకాలు ముద్రించుకొని వివిధ ప్రాంతాల్లో రజక కులస్తులనే కాకుండా వేరే కులాల వారి నుంచి చందాలు వసూళ్లు చేస్తున్న విషయం తమ కమిటీ దృష్టికి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో రజక సత్రం కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కోటయ్య, వర్మ, రంగా, లింగయ్య, రమణయ్య, నారాయణ, పిచ్చయ్య, సునీత, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల స్థలాన్ని కాపాడాలి

కోదాడ : కోదాడ ప్రభుత్వ వైద్యశాల స్థలాన్ని కాపాడాలని కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త పాదుగు హుస్సేన్ కోరారు. శుక్రవారం కోదాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు దాతలు రెండు ఎకరాల స్థలం ఇచ్చారని, ప్రస్తుతం అక్కడ ఎకరం 15 గుంటలు మాత్రమే ఉందని, మిగతా స్థలం ఆక్రమణకు గురైందని తెలిపారు. అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు సర్వేలతో స్థల ఆక్రమణకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని తిరిగి తీసుకున్న తరువాతే 100 పడకల వైద్యశాల నిర్మించాలని ఆయన కోరారు. స్థలం విషయం తేల్చకుండా 100 పడకల వైద్యశాల కట్టాలని నిర్ణయించడాన్ని నిరసిస్తూ ఈ నెల 28న జిల్లా కలెక్టరేట్‌లో తాను నిరసన దీక్ష చేపడతానని తెలిపారు. ఈ సమావేశంలో కుదరవెళ్లి బసవయ్య, కొల్లు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ లేక అవస్థలు

'ఉపాధి'లో సౌకర్యాలు కరువు
- పని ప్రదేశాల్లో కనిపించని టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు
- కూలీలకు అందని తాగునీరు
- ప్రభుత్వం నుంచి రాని పనిముట్లు



గోపాలపురంలో మండుటెండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



బూరుగడ్డలో చెట్లకు పట్టాలు కట్టుకుని నీడకు కూర్చున్న ఉపాధి హామీ కూలీలు

హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఎండ నుంచి ఉపశమనానికి కనీస నిలువ నీడ లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. పని ప్రదేశాల వద్ద టెంట్లు ఏర్పాటు చేసే నాథుడే లేరు. పని ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు కనిపించడం లేదు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో కూలీలందరికీ పని కూడా దొరకడం లేదు. పని కల్పించినప్పటికీ చేసిన పనికి సకాలంలో కూలి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ఎండలోనే పనులు..

ప్రస్తుత వేసవిలో ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు పనిచేయాలని అధికారులు చెబుతున్నారు. కానీ ఉదయం 8 గంటలకే భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఎండకు పనులు చేయాలంటే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు త్వరగా అలసిపోతున్నామని, చల్లని నీరు కూడా లేదని, ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్ల సీసాలు త్వరగా వేడిగా అవుతున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కూలీలకు ఇచ్చే గడ్డపార, పార, ఇనప బొచ్చేలతో పాటు ఇతర పనిముట్లు పంపిణీ కూడా నాలుగేళ్ల నుంచి లేకపోవడంతో కూలీలే ఇళ్ల వద్ద నుంచి పనిముట్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు.

అందరికీ పని దొరకడం లేదు..

హుజూర్‌నగర్ మండలంలో 7, 116 మందికి జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 1600 నుంచి 1800 మంది కూలీలు మాత్రమే ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. అయితే మండలంలో ప్రస్తుతం యాసంగి వరి కోతల పనులు కూడా పూర్తి అయ్యాయి. కూలీలకు పనులు కూడా లేదు. కానీ కూలీలందరికీ ఉపాధి హామీ పనులు దొరకడం లేదని, అధికారులు పనులు కల్పించడం లేదని ఉపాధి హామీ కూలీలు ఆరోపిస్తున్నారు. కాగా, మరో రెండు వారాలు గడిస్తే ఉపాధి హామీ పనులు చేసే కూలీల సంఖ్య ప్రస్తుతం దానికంటే రెండింతలు పెరిగే అవకాశం ఉంది.

సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. వేసవిలో ఎండల తీవ్రత పెరగడంతో పనులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాం. ఇంటి నుంచి తీసుకెళ్తున్న నీళ్లు ఎండకు వేడెక్కుతున్నాయి. పనిముట్లు సైతం కాలుతున్నందున పనులు సైతం చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలి.

– షేక్ ఇమామ్, ఉపాధి కూలీ, కరక్కాయలగూడెం

సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం



ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. గత నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి పనిముట్లు, టెంట్లు సరఫరా లేదు. ఎండ తీవ్రతను బట్టి అవసరమైన చోట్ల టెంట్లు ఏర్పాటు చేయమని ఆదేశాలిచ్చాం. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమయ్యే మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తాం.

– పిండిప్రోలు లావణ్య, ఇన్‌చార్జ్, ఎంపీడీఓ, హుజూర్‌నగర్

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మునగాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్

మునగాల : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు పీహెచ్‌సీల పట్ల నమ్మకం కలిగేలా వైద్యసేవలు అందించాలన్నారు. నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ నూతన భవనంలో ప్రభుత్వం అన్ని వసతులు సమకూర్చుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ రమేష్ దీనదయాళ్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన తాడువాయిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలను వీలైనంత త్వరలో పూర్తిచేయాలని, నిర్మాణాలను మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్, ఎంపీడీఓ, మాజీ వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాతంగి బసవయ్య, వీనేపల్లి వీరబాబు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు.



నడిగూడెం : కాగితరామచంద్రాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

నడిగూడెం : మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కాగితరామచంద్రాపురంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు నీలం శైలజతో ఆయన మాట్లాడారు. ఇంటి బేస్‌మెంట్ నిర్మాణ పనులు పూర్తికాగానే లక్ష రూపాయలు అకౌంట్‌లో పడ్డాయా అని అడిగి తెలుసుకున్నారు. డబ్బులు వచ్చాయని ఆమె కలెక్టర్‌కు సమాధానం ఇచ్చి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి పి.సతీష్‌కుమార్, ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, గృహ నిర్మాణ శాఖ అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

'బార్' ఎన్నికల్లో రాంరెడ్డి ప్యానల్ విజయం



ప్యానల్ సభ్యులతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ (2025– 2026) కు శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు సాముల రాంరెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య తెలిపారు. బార్ అసోసియేషన్‌లో మొత్తం 83 మంది ఓటర్లు ఉండగా 82 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సాముల రాంరెడ్డి తన సమీప ప్రత్యర్థి జక్కుల వీరయ్యపై 41 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా జక్కుల నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా చనగాని యాదగిరి, జాయింట్ సెక్రెటరీగా కొట్టు సురేష్, కోశాధికారిగా ఉప్పల గోపాలకృష్ణమూర్తి, గ్రంథాలయ కార్యదర్శిగా చిత్రం విశ్వనాథం, క్రీడల, సాంస్కృతిక కార్యదర్శిగా గొల్లగోపు నవీన్ విజయం సాధించారు. కార్యవర్గ సభ్యులుగా కె.నాగార్జున, సీహెచ్.రమేష్ జి.ప్రశాంత్, డి.శ్రీనివాస్, సైదాహుస్సేన్ గెలుపొందినట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనంతరం వారిని పలువురు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చర్చి ప్రారంభోత్సవం



చర్చిని ప్రారంభిస్తున్న స్టీవెన్సన్ బెంజిమెన్ ఉప్పల

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో రూ.1.15 కోట్లతో నిర్మించిన ఉప్పులలేవి పంతులు మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిని శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీవెన్సన్ బెంజిమెన్ ఉప్పుల, ఎం.ప్రభుదాస్, డాక్టర్ రాపోలు కరుణాకర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ మహోత్సవానికి పరిసర ప్రాంత క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రాపోలు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పాతకోటి రమేష్, పాస్టర్లు పల్లె శ్యాండేవిడ్, జబర్దస్ నటులు గడ్డం రాజమౌళి, బాబు, నేరేడుచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చల కూరి ప్రకాశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్

గరిడేపల్లి : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు ప్రతి కుటుంబం నుంచి ఇద్దరు చొప్పున తరలిరావాలని కోరారు. బహిరంగ సభకు కార్యకర్తలు తరలివచ్చేలా అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు కృషి చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఎగరవేసి సభకు రావాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మండల మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, వెంకటరమణారెడ్డి, మాశెట్టి శ్రీహరి, కీతా రామారావు, రాంసైదులు, బొలిశెట్టి సుధీర్, నాగిరెడ్డి, వెంకటమ్మ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ విజయవంతానికి విస్తృత ప్రచారం

మఠంపల్లి : వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభ విజయవంతానికి మండల వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య తెలిపారు. శుక్రవారం మఠంపల్లిలో బహిరంగ సభ పోస్టర్లు కార్యకర్తలు గోడలకు అంటించడాన్ని పర్యవేక్షించి మాట్లాడారు. మండలం నుంచి వేలాదిమంది సభకు తరలిస్తామని తెలిపారు. ఆయన వెంట పార్టీ మఠంపల్లి గ్రామ అధ్యక్షుడు పిండిప్రోలు రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ కొండేటి సుధాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కిరణ్‌యాదవ్ ఉన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు



కోదాడరూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రగతి మహిళా మండలి సభ్యులు

కోదాడరూరల్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు నూనె సులోచన అన్నారు. పహల్గాం దాడులకు నిరసనగా శుక్రవారం కోదాడ పట్టణంలో ప్రగతి మహిళా మండలి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉగ్రవాదుల దాడులను భారత ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఖండించాలన్నారు. కార్యక్రమంలో సీత, కృష్ణవేణి, జానకి, హైమావతి, శైలజ, కెజ్జమ్మ, దేవమణి, ఖాజాబీ తదితరులు ఉన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లింల నిరసన

మఠంపల్లి : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు టూరిస్టులపై కాల్పులు జరపడాన్ని ఖండిస్తూ శుక్రవారం మఠంపల్లిలో మండల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మౌనం పాటించారు. మసీద్‌లో ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ వహబ్ మాట్లాడుతూ భారతదేశంలో మత సామరస్యాన్ని చెడగొట్టే విధంగా మారణహోమం సృష్టించిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు బాబు, జానీపాషా, ఉమర్, సిద్దిక్, హఫీజ్‌సుబాని, పాషా, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ

హుజూర్‌నగర్ : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారి ఆత్మకి శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం హుజూర్‌నగర్‌లోని 3వ వార్డులో మహిళలు వెలుగుతున్న కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోతి శరణ్య మాట్లాడుతూ.. ఉగ్రదాడిని అన్ని వర్గాలు ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. దేశంలో హింసకు తావు లేదని, ప్రజలు శాంతి సామరస్యాలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో గాలి రజిత, లావణ్య, దీప, అలివేలు, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : 3వ వార్డులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం చింతలపాలెంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పాకిస్తాన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి స్థానిక చౌరస్తాలో దహనం చేశారు. తీవ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి వెలుగుతున్న కొవ్వొత్తులతో అశ్రు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నవీన్, సతీష్, గోపి, వెంకటేష్, శ్రీను, సైదులు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ

హుజూర్‌నగర్ : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి బాధ్యులైన వారిని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ముస్లిం మత పెద్దలు ముఫ్తీ మహమ్మద్ గౌసుద్దీన్, అబ్దుల్ రహీం మౌలానా కోరారు. ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం హుజూర్‌నగర్‌లో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మసీద్ వద్ద మౌనం పాటించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు, జాతీయ జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమాయకులైన టూరిస్టుల మీద ఉగ్రదాడి పిరికి పంద చర్య అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్‌ఐ ప్రేరేపిత ఉగ్రవాదులు భారతదేశంలో మత సామరస్యాన్ని చెడగొట్టే విధంగా మతం పేరు అడిగి మారణ హోమం సృష్టించడం వాళ్ల రాక్షసత్వానికి నిదర్శనమని తెలిపారు. ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికసాయంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజీజ్ పాషా, నిజాముద్దీన్, అబ్దుల్ మజీద్, మన్సూర్ అలీ, రఫీ, నవాబ్ జాని, లైటింగ్ జానీ, మున్నా, హఫీజ్ రహమతుల్లా, రజవాలి బాబా, లతీఫ్, మజీద్, రహీం, లతీఫ్, అశ్రఫ్‌అలీ, యూసఫ్, జిలానీ, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : చింతలపాలెంలో పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చిలుకూరులో కొవ్వొత్తులతో ర్యాలీ

చిలుకూరు : జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై చేసిన కాల్పుల దాడికి నిరసనగా శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శులు షేక్.సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, చేపూరి కొండలు, దొడ్డా వెంకటయ్య, పిల్లుట్ల కనకయ్య, సిరారపు శ్రీను, బాలెబోయిన రాంబాబు, కొదారు శ్రీను, అనంతుల రాము, పుట్టపాక అంజయ్య, కొండ వెంకయ్య పాల్గొన్నారు.



చిలుకూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



మఠంపల్లిలో మౌనం పాటిస్తున్న ముస్లింలు

మలేరియాను తరిమికొడదాం



హుజూర్‌నగర్‌రూరల్ : లింగగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది




గరిడేపల్లిలో..

గరిడేపల్లి : 2030 సంవత్సరం నాటికి మలేరియా నిర్మూలనకు అందరం కలిసి కృషి చేయాలని మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుందాం –మలేరియాను తరిమికొడదాం అని అన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి ఆవాసాలలో మురికి నీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, పీహెచ్ఎస్ఎం శారద, సూపర్‌వైజర్లు అంజయ్య, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం కవిత, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ కోరారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రేపాలలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి మలేరియా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. 2030 వరకు మలేరియా నిర్మూలన దిశగా మనమందరం పనిచేయాలని పిలుపునిచ్చారు. దోమ పుట్టకూడదు, దోమ కుట్టకూడదు అనే నినాదంతో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి బి.భాస్కర్ రాజు, సూపర్‌వైజర్ బి.జయమ్మ, నర్సింగ్ అధికారి సునీత, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీంద్ర, ఏఎన్ఎంలు బి.పద్మ, కె.పద్మ, ఆశా వర్కర్లు జ్యోతి, రమణ, భాగ్య పాల్గొన్నారు.



మునగాల : రేపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు

హుజూర్‌నగర్‌రూరల్ : దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ మలేరియా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి కిటికీలకు జాలీలు అమర్చుకోవాలని సూచించారు. మలేరియా వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమ వ్యాధి ఉన్న వ్యక్తిని కుట్టి ఆరోగ్యవంతుడిని కుట్టడం ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారిణి పద్మ, పీహెచ్ఎన్ నూర్జహాన్, హెచ్ఏలు ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్, అలివేలుమంగ, వరలక్ష్మి, ప్రశాంతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరెంతో రుచిగా.. తాగుతున్నారు ఇష్టంగా



చేత బావిలో నీటిని తోడుతున్న బొడ్డు గుర్వయ్య

మోతె : మండల కేంద్రంలో వందేళ్లకు పూర్వం నాటి తిర్పతమ్మ చేత బావి చెక్కు చెదరకుండా ఉంది. స్థానిక ప్రజలకు నీటి సౌకర్యం ఉన్నా తిర్పతమ్మ బావి నీరు రుచికరంగా ఉంటుండడంతో తోడుకొని తీసుకెళ్తున్నారు. ప్రతిరోజూ తాగేందుకు తిర్పతమ్మ బావి నీటినే తీసుకెళ్తానని గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు బొడ్డు గుర్వయ్య అంటున్నాడు. ఈ బావి నీరు తియ్యగా, రుచిగా ఉంటాయని చెబుతున్నాడు. నిజాం పాలనలో కమ్యూనిస్టు ఉద్యమ నాయకులను, సాయుధ బలగాలను గాలిస్తూ గ్రామాల్లోకి వచ్చిన పోలీస్ బలగాలు గ్రామ శివారులో డేరాలు వేసుకొని నెలల కొద్ది క్యాంపుల్లో ఉండి ఈ బావి నీరే తాగారని, ఈ బావి నీరు రుచికరంగా ఉండడంతో నాటి అమీన్‌సాబ్ నల్లగొండ కేంద్రానికి కూడా ఈ బావి నీటిని జవాన్లతో తెప్పించుకునే వారని బొడ్డు గుర్వయ్య తెలిపారు. అంత చరిత్ర కలిగిన ఈ బావినీటినే మా గ్రామస్తులు తాగడం సంతోషంగా ఉందని అంటున్నాడు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం నిత్యారాధనలు కొనసాగాయి. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని నిర్వహించి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.